International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# యూదుల రాజు సొలోమోను సామెతలతో తెలుగు సామెతల ఏకార్థముల విశ్లేషణం

**ఫాదర్ డాక్టర్ గుజ్జుల అంతోని పీటర్ కిశోర్, ఎస్. జె**

**ప్రిన్సిపల్, ఆంధ్ర లొయోల (స్వయంప్రతిపత్తి) కళాశాల, విజయవాడ**

సామెతల ముఖ్య ప్రతిపాదనలు వివిధ రకాలు, కొన్ని నలుగురి గమనంలో ఉన్నదానిని ఉన్నట్లు చెప్పి ఊరుకుంటాయి. మరికొన్నిటిలో హితబోధ, ఉపదేశం కరతలామలకమై సామెత వినగానే చటుక్కున స్ఫురించే విధంగా ఉంటుంది. 'తినడానికి తిండి లేదు గాని తనవారికి తద్దినాలు', లేదా 'అప్పుచేసి పప్పుకూడు' అనగానే ఇక్కట్లలో ఉన్నప్పుడే డాబుసరి పనికిరాదు (సీరా 18:13) అనే హితోపదేశం ప్రత్యక్షమై ఆకట్టుకొంటుంది. ఈ కోవకు చెందిన సమానార్థకమైన తెలుగు, బైబులు సామెతలను ఈ అధ్యాయంలో పరిశీలిద్దాం. ఎందుకంటే

సొలోమోను 3,000 సామెతలు చెప్పాడు. 1,005 కీర్తనలు రచించాడు. లెబానోనులో పెరిగే దేవదారు వృక్షమే గాని, గోడలో నుండి మొలిచే హిస్సోపు మొక్కే గాని, చెట్లన్నిటిని గూర్చి అతడు రాశాడు. ఇంకా మృగాలు, పక్షులు, పాకే జంతువులు, జలచరాలు, అన్నిటిని గురించీ అతడు రాశాడు. అతని జ్ఞానం గురించి వినిన భూరాజులందరిలో నుండీ ప్రజలందరిలో నుండీ అతని జ్ఞానవాక్కులు తెలుసుకోడానికి మనుషులు సొలొమోను దగ్గరకి వచ్చారు. ఆ చక్రవర్తి వైభవాన్ని బైబులు ఇలా వర్ణిస్తున్నది. యూదావారూ ఇశ్రాయేలు వారూ సముద్రం ఒడ్డున ఉండే ఇసుక రేణువులంత విస్తారమైన సమూహంగా ఉండి తింటూ, తాగుతూ, సంబరపడుతూ ఉన్నారు. నది (యూఫ్రటీసు) మొదలుకుని ఐగుప్తు సరిహద్దు వరకూ ఆ మధ్యలో ఉన్న రాజ్యాలన్నిటి మీదా ఫిలిష్తీయుల దేశమంతటి మీదా సొలొమోను అధికారం ఉంది. సొలొమోను బతికిన కాలమంతా ఆ ప్రజలు అతనికి పన్ను చెల్లిస్తూ, అణిగిమణిగి ఉన్నారు. రోజుకి సొలొమోను భోజన సామగ్రి 600 తూముల మెత్తని గోదుమ పిండి, 1,200 తూముల

ముతక పిండి, పది కొవ్విన ఎద్దులు, గడ్డి మైదానాల నుండి తెచ్చిన ఎద్దులు 20, గొర్రెలు 100. ఇవిగాక ఎర్ర దుప్పులు, దుప్పులు, జింకలు, కొవ్విన బాతులు. యూఫ్రటీసు నది ఇవతల తిప్సహు నుండి గాజా వరకూ నది ఇవతల ఉన్న రాజులందరి మీదా సొలొమోనుకు అధికారముంది. అతని కాలంలో నాలుగు దిక్కులా శాంతి నెలకొంది. సొలొమోను కాలమంతా ఇశ్రాయేలు వారూ యూదా వారూ దాను నుండి బెయేర్షెబా వరకూ తమ తమ ద్రాక్షచెట్ల కిందా అంజూరపు చెట్ల కిందా నిర్భయంగా నివసించారు.

'క్రియలు లేని విశ్వాసము వ్యర్థమని' బైబులు చెబుతుంటే 'చెప్పుట కంటే చేయుట మేలు' అని తెలుగు సామెత సెలవిస్తున్నది. తెలుగు సామెత 'గోడకి చెవులుంటాయి' అని ఊరుకుంటే 'మనస్సులో కూడ రాజును విమర్శించకుము' అని బైబులు సామెత హితవు పలుకుతున్నది. ఆ విధంగా ఈ వర్గంలో ఉన్నవన్నీ ప్రబోధాత్మక సామెతలు.

1. తెలుగు సామెత: ఇంటికి గుట్టు, మడికి గట్టు.

బైబులు సామెత: గుఱ్ఱమునకు కొరడా. గాడిదకు కళ్లెము, మూర్ఖుని వీపునకు బెత్తము అవసరము (సామెతలు 26:3).

"రౌతు మెత్తనైతే గుఱ్ఱం మూడు కాళ్ళమీద నడుస్తుందని" సామెత, అంటే గుఱ్ఱాన్ని కొరడాతో దండించే రౌతు లేకపోతే అది సరిగా నడవదు. గాడిదకు కళ్లెం లేకపోతే, లేక గంతకట్టకపోతే అది మాట వినదు. అలాగే బెత్తంతో దండించకపోతే మూర్ఖుడు మాట వినడు. అంటే అదుపు చేయగలిగిన ఆయుధం లేనిదే గుఱ్ఱం, గాడిద, మూర్ఖుడు బుద్ధిగా పనిచేయరని అర్థం.

తెలుగు సామెతలో ఇంటికి గుట్టు, మడికి గట్టు అవసరమని ఉంది. గుట్టు లేని సంసారం వీధిన బడుతుంది. నవ్వులపాలై నలుగురి చేత నిరసించబడుతుంది. "సంసారానికి గుట్టు, రోగానికి రట్టు" అని మరొక సామెతలో కూడా ఇంటికి గుట్టు అవసరమనే భావం కనిపిస్తోంది. ఇంటి సంగతులు ఇరుగు పొరుగువారితో చెప్పుకుని వారు ఓదార్చుతారని భావిస్తే ఏదో సాయం చెస్తారని ఆశిస్తే, నిరాశ ఎదురుకావడమే కాకుండా, ఇంటి గుట్టు రచ్చకెక్కి మనం చులకనైపోతాం. మా ఆయన కాబట్టి సంసారం గుట్టుగా సాగినప్పుడే సంఘంలో మర్యాద కలుగుతుంది. మాకవి లేవు. ఇవి లేవు. అలాటివాడు, మా అత్త మామలు

చాదస్తులూ.. ఈ విధంగా ఇంటి విషయాలు బయటవేసుకుంటే మనం అందరికీ లోకువైపోతాం. "కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందన్న" సామెతలో కూడా ఇదే అర్థం ధ్వనిస్తుంది.

మడి అంటే పొలం, పొలానికి గట్టు కావాలి. అంటే హద్దని కూడా అర్థం ఉంది. ఇంత వరకు నా పొలం అని ఒక పరిమాణం ఉంటే అంతవరకు మనం బాగుచేసుకుని, పండించుకుని ఫలితాలను అనుభవించవచ్చు. 'గట్టు' అంటే చుట్టూ ఎత్తుగా పోసే కట్ట అని అర్థం. ఆ గట్టు (కట్ట) లేకపోతే మన పొలానికి పెట్టిన నీరు ప్రక్క పొలానికి పోయే ప్రమాదం ఉంది. కాబట్టి హద్దు విషయంలోను, మన పొలంలోని నీరు, సారం వేరొక పాలంలోనికి వెళ్ళకుండాను తప్పకుండా మడికి గట్టు అవసరం.

గుఱ్ఱానికి కొరడా లేకపోయినా, గాడిదకు గంత లేకపోయినా, మూరు?నికి బెత్తం లేకపోయినా ప్రమాదమే. అలాగే ఇంటికి గుట్టు లేకపోయినా, మడికి గట్టు లేకపోయినా ప్రమాదమే, కనుక ప్రమాదాల నుంచి బయటపడి సామాజిక జీవనం నవ్యంగా సాగాలంటే సామెతలలో చెప్పినట్లు అదుపు ఉండాలి.

2. తెలుగు సామెత: ఎవరు త్రవ్విన గోతిలో వారే పడతారు.

బైబులు సామెత: ఎవడు త్రవ్విన గోతిలో వాడే పడును. (సామెతలు 26:27; సీరా 27:26).

గుంటలు త్రవ్వడం, గోతులు తియ్యడం అనేవి జాతీయాలు, వీటికి ఎదుటివారికి కీడుచెయ్యడం అనే అర్థం వస్తుంది. ఎదుటివాణ్ణి పడగొట్టడానికి చాటుమాటుగా గుంట త్రవ్వడం అంటే అతనికి తెలియకుండా కుట్ర పన్నడం అని భావం, ఎదుటివాడిని పడగొట్టడానికి గుంట త్రవ్వితే దానిలో త్రవ్వినవాడే పడతాడని, ఎదుటివాడిని పాడు చెయ్యడానికి ప్రయత్నిస్తే తానే పాడైపోతాడని ఈ సామెతల భావం. ఇది ముమ్మాటికీ నిజం. బైబులులోనూ, తెలుగు సాహిత్యంలోనూ నేటి మానవ జీవితాలలోనూ ఈ సామెతలకు అనేక తార్కాణాలు కనిపిస్తుంటాయి. ఉదాహరణకు ఎస్తేరు గ్రంథంలోని హామాను మొర్దెకయిని చంపించబోయి తానే చనిపోవలసి రావడం ఇందుకు మంచి ఉదాహరణం.

'చెఱపకురా చెడేవు' అనే మరొక తెలుగు సామెతను దీనికి సమానార్థకంగా చెప్పుకోవచ్చు. మనం ఒకరిని నాశనం చెయ్యాలని భావిస్తే, మనమే నాశనానికి

పరుగెత్తుతున్నట్టు లెక్క ఒకరిని పాడుచెయ్యడానికి పరుగెత్తేవాడు తానే పాడైపోయిన సంఘటనలు కోకొల్లలు, యేసు కూడా ఇదే విషయాన్ని పలుమారులు ప్రస్తావించాడు. మీరు ఏది చేస్తే, అదే మీకు సంభవిస్తుందని ప్రబోధించాడు. 'మీరు ఏ కొలతతో కొలుతురో ఆ కొలతతోనే మీకు మరల కొలువబడు'నని యేసు చెప్పాడు (లూకా 6:38).

'చేసుకున్నమ్మకు చేసుకున్నంత మహదేవ' అని ప్రజాబాహుళ్యంలో మరొక సామెత ఉంది. ఎవరు ఎంత చేసుకుంటే అంత ప్రయోజనం కలుగుతుందని భావం. దీనిలో కూడా మనం ఏది చేస్తామో దాని ఫలితాన్నే పొందుతామనే భావనే ఉ ంది. "తనను కట్టివేయడానికి తానే తాడు తెచ్చుకున్నట్టు" అనే సామెత కూడా దీనికి సమానమైనదే. కాబట్టి తాను త్రవ్వుకున్న గోతిలో తానే పడ్డాడు అనే తెలుగు సామెత, బైబులు సామెత నిత్య జీవితాలలో క్రియారూపం దాలుస్తున్నవే.

కాబట్టి ఒకరికి హాని చెయ్యాలని తలంచకుండా ఉంటే తనకే హానీ కలుగదని నమ్మవచ్చు. తాను ఇతరుల కోసం గుంట త్రవ్వితే, ఇతరులను మోసం చెయ్యాలని భావిస్తే తానే గుంటలో పడడం, మోసపోవడం ఖాయం అని కూడా భావించవచ్చునని ఈ తెలుగు, బైబులు సామెతలు చెబుతున్నాయి.

3. తెలుగు సామెత: ఎవరూ దొంగిలించలేనిది చదువొక్కటే.

బైబులు సామెత: వెండి బంగారములను చేకూర్చుకొనుట కంటె విజ్ఞానమును ఆర్జించుట మేలు (సామెతలు 3:14).

ప్రజల స్మృతి పథంలో అనుభవ పూర్వకంగా ఉదయించి నలుగురి నోళ్ళలో నానే నిత్య సత్యాలే కవిపుంగవుల, నీతివేత్తల కలాల నుండి సాహిత్యంగా జాలువారుతాయి. విద్యకుండిన అసమాన విలువను ప్రస్తుతిస్తూ భర్తృహరి సుడివిన 'హస్తుర్యాతినగోచరం' శ్లోకాన్ని కమనీయమైన తెలుగులో ఏనుగు లక్ష్మణ కవి ఇలా తెనిగించాడు.

'హర్తకుగాడు గోచర మహర్నిశేశమున్ సుఖపుష్టిసేయు స
త్కీర్తి ఘటించు విద్య యను దివ్య ధనం బఖిలార్థ కోటికిం
బూర్తిగ నిచ్చిననె బెరుగు బోదు యుగాంతపు వేళనైన భూ
భర్తలు తడ్డనాధికుల పట్టున గర్వము మాను బొప్పగున్'

భుజకీర్తులు, వడ్డాణాలు, చంద్రహారాలు

తదితర ఆభరణ విశేషాలు, స్నానాదికాలు, చందనలేపనాలు, చిత్ర విచిత్ర కేశాలంకరణ మొదలైనవేవీ అలంకారాన్నియ్యజాలవు. జ్ఞానపూరితమైన వాగ్భూషణమే నిజమైన భూషణం, విద్యయే నిక్షేపంగా దాచిపెట్టుకొన్న ధనం, విద్యయే సుఖదాయకం విద్యయే గురుతుల్యం స్వదేశీమిత్రుడు విదేశ బంధువు విద్యయే విద్యయే నృపాల పూజితం అంటూ విద్య విశిష్టతను కొనియాడారు పండితులు. విద్యలేనివాడు వింత పశువు అన్నారు.

బైబులు సామెత ఇదే ఆదర్శాన్ని పళ్ళాణిస్తూ సువర్ణరత్నమణి మాణిక్యాలు విద్యకు సాటిరావనీ, విజ్ఞాన సముపార్జనే అన్ని సంపదలకన్నా మిన్నయనీ తీర్మానిస్తున్నది. ఈ సామెతకు కర్తయైన సాలోమోను తత్త్వసారాంశాన్ని తెలుపుతూ జ్ఞానమునకు నీ చెవియొగ్గి హృదయపూర్వకముగా వివేచన సభ్యసించిన యెడల. వెండిని వెదకినట్లు దాచబడిన ధనమును వెదకినట్లు దానిని వెదకిన యెడల... విజ్ఞానము నీకు లభించును' (సామెతలు 2:3-5) అని సిద్ధాంతీకరించాడు.

తథాగతుని మహావరి నిర్వాణ సమయంలో పరిపూర్ణ జ్ఞానోదయానికి ముందటి జాములో అతనిలోని అవిద్య నశించింది. ఆ పైననే అతడు సంబుద్ధుడైనాడు. యౌవనం దేహాన్ని విడిచిపోవచ్చు. సిద్ధి తరలిపోవచ్చు, సతీసుత బంధుగణం విసర్జించవచ్చు. తాను సముపార్జించిన విద్యను తన నుండి ఎడబాపగల వారెవరూ లేరు. పేరొకరు దోచుకొనగలిగిన దానిని, మనలను విడిచిపోయే ఆస్కారమున్నదానినీ లెక్కకు మిక్కిలిగా సంపాదించి తుదకు భంగపాటు చెందడంకంటే, ఎవరూ మననుండి అవహరింపలేని విద్యాధనాన్ని సంపాదించడం విజ్ఞుల లక్షణం.

4. తెలుగు సామెత: ఓటి కుండలో నీరు పోసినట్టు.

బైబులు సామెత: దూబర ఖర్చులతో సంసారమును నాశము చేసుకొనువానికి ఏమియు మిగలదు (సామెతలు 11:29)

నీరు నిలవాలంటే సరియైన పాత్రలో పొయ్యాలి. పగిలిన కుండలో నీళ్ళు పోస్తే నీళ్ళు నిలవవు. ఎంత సంపాదిస్తున్నామని లెక్క చూచుకోవడం కంటే ఎలా ఖర్చుపెడుతున్నామని పరీక్ష చేసుకోవడం ముఖ్యం, అహోరాత్రులు కష్టించి పనిచేసి రెండు చేతులా సంపాదించి, వ్యర్థంగా ఖర్చుపెడితే కష్టమంతా నేలపాలైనట్టే. ఎంతో

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

కష్టపడి నీళ్ళు తెచ్చి పగిలిపోయిన ఓటి కుండలో పోస్తే ఆ నీళ్ళు నిలబడవు. దివారాత్రులు కష్టపడి సంపాదించిన సొమ్మును దుర్వ్యయం చేస్తే అది నిష్ప్రయోజనం! అటువంటి సందర్భాలను తెలియజేయడానికి ఈ తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

దీనికి దీటైనదే బైబులు సామెత కూడా. దుబారా ఖర్చులతో సంపాదనను నష్టపరచుకొనే వారికి, చివరకు మిగిలేది చింతలే. డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, దాన్ని సరియైన అవసరాలకు సద్వినియోగం చేయడం కూడా అంతే ముఖ్యం, దుబారా ఖర్చులు చేయకూడదని, ఆ విధంగా ఖర్చు చేసుకుంటూ పోతే మిగిలేది శూన్యమనీ ఈ బైబులు సామెత తెలియజేస్తుంది.

ఆధునిక యుగంలో చాలామంది దుర్వ్యయాన్ని అరికట్టలేకపోతున్నారు. అనేక దురభ్యాసాలకు లోనై కష్టార్జితాన్ని వ్యర్థం చేసుకుంటున్నారు. ఆడంబరాలకు పోయి ఆస్తిపాస్తులు నాశనం చేసుకుంటే చివరకు మిగిలేది కటిక పేదరికమే. భార్యాబిడ్డలను, బంధువులను, హితులను, స్నేహితులను బాధించి, అనవసరమైన ఖర్చులు పెడితే బాధలు తప్ప ఫలితం లేదు. ఎంత సంపాదించినా ఖర్చును నియంత్రించకపోతే కడగండ్ల, ఎన్ని నీళ్ళు తెచ్చి ఓటి కుండలో పోసినా అవి నేలపాలే. ఈ రెండు సామెతలు ఒకే అర్థాన్ని తెలియజేస్తున్నాయి.

5. తెలుగు సామెత: అవకారికి ఉపకారము నెపమెన్నక చేయువాడు నేర్పరి.

బైబులు సామెత: అపకారికి ప్రత్యపకారము తలపెట్టకు (సామెతలు 20:22)

నీ శత్రువు ఆకలిగొని యున్నచో అన్నము పెట్టుము దప్పికగొని యున్నచో దాహమిమ్ము (సామెతలు 25:21).

ఇది తెలుగు సామెతా, బైబులు వాణీ ఉపదేశించే ఒక ఉదాత్త ధర్మమూ. ఈ సత్యం కాలాతీతం. యేసుక్రీస్తు ఏనాడో బోధించి, ఆచరించి చూపిన ఘన సత్యాన్ని మన బద్దెన ఈ పద్య మందారంలో వెలయించాడు. ఉత్తమ భావాలు సంస్కృతితో గాని, దేశ కాలపరిస్థితులతో గానీ సంబంధం లేకుండా మహాత్ముల నోట నుండి జాలువారుతుంటాయి. ఇలాటి ఉపదేశామృతం తుది లేని చైతన్య రఝరివలె శతాబ్దాల ఎల్లలు దాటి నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది.

ఉపకారం చేసినవాడికి ప్రత్యుపకారం చేయడం

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

సర్వసామాన్యం అవకారికి అవకారం చేయడానికి అదను కోసం చూడడమూ సాధారణమే. కుడి ఎడమ కావడమే విశేషం, కుక్క సైతం పెట్టిన చెయ్యిని కరవదు. ఇలాటి వికృత చేష్టలు మానవులకే పరిమితమైన దౌర్భాగ్యం. అదే సమయంలో అపకారికి ఉపకారం చేయడమనేది అన్ని ధర్మాలలోకీ తలమానికం కీడుకు ప్రతికీడు, హత్యకు ప్రతిహత్య చేయడం ద్వారా శత్రువును దెబ్బతీయడం, హతమార్చడం మాత్రమే సాధ్యం. అయితే చంపదగిన శత్రువు తన చేతచిక్కితే సాదరంగా చేయగలిగిన మేలు చేసి పంపితే శత్రువును కారు, అతనిలోని శత్రుత్వాన్ని విరోధ భావాన్ని పాతమార్చిన వారమవుతాము.

క్రీస్తు తనను సిలువనెక్కించి చిత్రహింసలు పెడుతున్నవారినుద్దేశించి 'వీరేం చేస్తున్నారో వీరికి తెలియదు, వీరిని 'క్షమించు' అని విధాతను వేడుకొన్నాడు. ఇది కేవలం దైవ లక్షణం, సర్వేశ్వరుడు మంచివారితో బాటు సమానంగా చెడ్డవారిపై కూడా సూర్యరశ్మి ప్రకాశింపజేస్తాడు. వర్షం కురిపిస్తాడు. సకలైశ్వర్యాలను ప్రసాదిస్తారు. ఆయనకు శత్రువులు, మిత్రులు అంటూ లేదు. ఆయన సమవర్తి ప్రకృతిలో సైతం ఈ దైవ గుణం అడుగడుక్కీ గోచరిస్తుంది. రాతి దెబ్బతిని గున్నమామిడి కొమ్మ సుమధుర ఫలాన్నిస్తుంది. భూమాత యెడను నాగటితో చీల్చి నాట్లు వేస్తే జీవనాధారమైన సస్యలక్ష్మిని సాక్షాత్కరింపజేస్తుంది.

పాండవులు ధర్మాత్ములు. వారు అరణ్యవాసంలో ఉన్న సమయంలో కౌరవులు దుర్బుద్ధితో ఘోషయాత్ర పేరుతో పాండవులున్న ప్రాంతానికి వచ్చి చెరుపు చేయబూనుకున్నప్పుడు గంధర్వులు వారిని బంధించారు. ధర్మరాజు అజమేరకు భీమార్జునులు వెళ్ళి కౌరవులను విడిపించి సాదరంగా హస్తినకు సాగనంపారు.

ఉపకారికి ఉపకారం మానవుని సహజగుణం. క్షమ, దయ, అంతకు మించి అవకారికి ఉపకారం ఈ లోకంలో అసహజం, మనుషులు ఈ సౌజన్యాన్ని అపార్థం చేసుకొనే అవకాశం కూడా ఉన్నది. అవతలివాడు మన మెతకదనాన్ని అసరాగా చేసుకొని వంచిస్తున్నాడని తెలిసి కూడా అతనికి సాయం చేయబూనుకోవడం సన్మార్గం, మనలను దెబ్బతీసిన వాడిని తిరిగి దెబ్బతీయడం వల్ల ఎడతెగక పగ కొనసాగుతూ ఉంటుంది. ఈ కక్షలు, కార్పణ్యాలు తరాలకు తరాలు రావణుని

కాష్టంలా రగులుతూనే ఉంటాయి. ఒక్క ఉత్తముడు తన ఉదాత్త గుణం చేత కయ్యాన్ని నెయ్యంగా మార్చుకోగలిగే ఔదార్యం ప్రదర్శించగలిగితే ఎన్ని తరాల పగైనా ఇట్టే సమసిపోతుంది. అటువంటివాడే నేర్పరి, జ్ఞాని, మహానుభావుడు, ఈ సత్యాన్నే ఈ సామెతలు చాటుతున్నాయి.

6. తెలుగు సామెత: అనువుగానిచోట అధికులమనరాదు.

బైబులు సామెత: రాజు ఎదుట డంబము చూపకుము, గొప్పవారున్నచోట నిలవకుము (సామెతలు 25:6).

వసుదేవుడంతటివాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడట. కార్యసిద్ధి జరగవలసిన చోట కొంత తగ్గి మనోరథమీడేర్చు కుంటారు ఉత్తములు, మత్తగజమైనా నీటిలో మొసలిచే ఈడ్వబడుతుంది. సమయాసమయ విచక్షణ కలిగి స్థల సందర్భవివేచనతో మెలగమన్న హితవు పల్కుతున్నాయి ఈ సామెతలు.

'నెయ్యపు కిన్క' బూనిన సత్యభామ తన నాథుని శిరము 'జలజాతాసన వాసవాది సురపూజా భోజనమని' కూడా చూడక వామపాదంతో తొలగజేసింది కదా. వెన్నుడు తాను ఘటనా ఘటన సమర్థుడైనా, లీలామానుష వేషధారియైనా ఆగ్రహించక 'దాసుని తప్పులు దండముతో సరి' అంటూ దాసోహమన్నాడు. ప్రణయ కలహంలో నేనధికుడినని అహం చూపితే రసాభాసమవుతుంది.

అది అలా ఉంచి తెలుగు, బైబులు సామెతలు తాహతెరిగి అనుపానులు తెలిసి ప్రవర్తించాలని ఉపదేశిస్తున్నాయి. రాజ సన్నిధిలో నిలుచున్నప్పుడు రాజు అడిగితే మట్టు మర్యాదలతో జవాబివ్వాలి తప్ప పూనుకొని అహంకరించి ప్రేలకూడదు. విద్వద్గోష్టిలో ప్రల్లదుల ప్రేలాపనలు అపహాస్యం పాలవుతాయి.

కాగా మహాత్ములు అననుకూల పరిస్థితుల్లో మిన్నకుండడం వల్ల వారి మహత్తుకేమీ భంగం వాటిల్లదు. వేమన చెప్పినట్టు పెద్ద కొండ అద్దంలో కొంచెంగా కనిపించడా మరి?

7. తెలుగు సామెత: మింగ మెతుకు లేదు, మీసాలకు సంపంగి నూనె!

కొందరు ఏమియు లేకున్నను సంపన్నుల వలె నటింతురు (సామెతలు 13:7).

ఇంట్లో ఈగల మోత, బైట పల్లకీల మోత' అనే సామెతను దీనికి సమానార్థకంగా చెప్పవచ్చు. కడుపునిండా తిండి ఉండదు. కనీసావసరాలు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

తీర్చుకునేందుకు డబ్బుండదు. ఆడంబరాలు మాత్రం తగ్గవు. ఇది నేల విడిచి సాము చేయడం లాంటిది. ఊహా ప్రపంచంలో గాలిమేడలు కట్టి అందులో నివసించడం లాంటిది. దీన్ని తెలియజేయడానికి పై తెలుగు సామెతను ప్రయోగిస్తారు.

బైబులు సామెతలో కూడా తెలుగు సామెతలో ధ్వనించే అర్థమే ద్యోతకమవుతుంది. గొప్పలకు పోయి కడుపు మాడ్చుకోవడం కంటే, సామాన్య జీవితాన్ని గడిపి పొట్టకూడు సంపాదించుకోవడం మేలు కదా. ధనవంతుని వలె నటించి, డంబముగా ప్రవర్తించి దారిద్ర్యాన్ని చవిచూడడం కంటే సామాన్యునిగా ప్రవర్తించి కనీసావసరాలు సంపాదించుకోవడం ఉత్తమం.

గొప్పలు పోవడం ఎప్పుడూ మంచిది కాదు, నిజంగా గొప్పతనం ఉంటే దాన్ని ప్రదర్శించడం తప్పు కాదు. కోతలు కోస్తూ, డాంబికాలు పలుకుతూ, నేలవిడిచి ఊహా ప్రపంచంలో విహరించడం మంచిది కాదు, ఆకాశ సౌధాలు నిర్మిస్తే, అవి తప్పకుండా కూలిపోతాయి. అందనివాటి కోసం అర్రులు చాచి చెడిపోవడం కన్నా, అందుబాటులో ఉన్న వాటిని అనుభవించి సుఖించడం మిన్న. ఇదే భావాన్ని తెలుగు సామెత, బైబులు సామెత సమానంగా విశదీకరిస్తున్నాయి.

8. తెలుగు సామెత: ఎద్దు వలె తిని, మొద్దు వలె నిద్రపోయినట్లు...

బైబులు సామెత: సోమరీ, ఎందాక నీవు పండుకొని యుందువు? ఎప్పుడు నిద్ర లేచెదవు? (సామెతలు 6:9)

ఆధునిక కాలంలో సోమరితనం 'ఎయిడ్స్' కంటే ప్రమాదకరమైనదని విజ్ఞులు వక్కాణిస్తున్నారు. అది నూటికి నూరుపాళ్ళు నిజం! నిద్రమత్తు, సోమరితనం దారిద్ర్యానికి దారితీస్తాయని విజ్ఞానుల అభిప్రాయం. "కృషితో నాస్తి దుర్భిక్షం, జపతో నాస్తి పాతకం" అనేది సాంస్కృతిక సామెత! పని చేయువాడే ఆహారానికి పాత్రుడని బైబులు ప్రబోధిస్తుంది, సోమరితనం సమస్త అనర్థాలకు మూలం. చింపిరి గుడ్డలకు కారణం.

చీమలను చూచి సోమరులు గుణపాఠం నేర్చుకోవాలి. అవి సృష్టిలో చిన్నజీవులు. పుట్టలలో జీవిస్తాయి. నిరంతరం శ్రమిస్తూనే ఉంటాయి. బైబిలులోని సామెతలు "సోమరీ, చీమల యొద్దకు వెళ్ళు, వాటి నడతను కనిపెట్టి జ్ఞానం తెచ్చుకో" అని ప్రబోధిస్తున్నాయి. నిజంగా మానవుడు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

చీమలను చూచి, చురుకుతనాన్ని, కష్టించే స్వభావాన్ని అలవాటు చేసుకోవాలి. సోమరి తన కంచంలో చెయ్యివేసి, అన్నం ముద్ద తీసుకోవడానికి కూడా బద్దకిస్తాడని, బాధపడతాడని బైబులు తెలియజేస్తుంది.

శ్రమైక జీవన సౌందర్యానికి ఖరీదు కట్టే షరాబు లేడంటాడు శ్రీ శ్రీ. శ్రమజీవి చెమటలో సిరిసంపదలు వర్ధిల్లుతాయని పెద్దలు చెబుతారు. శ్రమించడం జీవలక్షణం! నిర్జీవంగా నిద్రించడం మృతతుల్యం! కనుక నిద్రమత్తు వదిలి ప్రతివాడూ చురుకుదనంతో పనిచెయ్యడం చాలా అవసరం, బైబులు కేవలం ఆధ్యాత్మిక విషయాలనే కాకుండా, ఈ లోకంలో ఎలా జీవించాలి, ఎలా శ్రమించాలి. పదుగురితో ఎలా ప్రవర్తించాలి అనే విధానాలను కూడా బోధిస్తుంది. సోమరితనాన్ని, నిద్రమత్తును వదిలి, నిరంతరం శ్రమించాలని తెలియజేస్తుంది.

తెలుగు సామెతలో ఎద్దువలె తిని, మొద్దువలె నిద్రించడం మంచిపని కాదనే ప్రబోధం ఉంది. "తిండికి పోతురాజు, పనికి బాలరాజు" అనే సామెత ఇదే అర్థాన్ని తెలియజేస్తుంది. నీవు తిండిపోతువైతే నీ గొంతుకకు కత్తి పెట్టుకొనుమని బైబులు బోధిస్తుంది. తిండిపోతులు, సోమరిపోతులు, నిద్రపోతులు అనతికాలంలోనే దరిద్రులౌతారని అందరికీ తెలుసు.

మానవునిలో జీవశక్తి ఉంది, చలన శక్తి ఉంది. దాన్ని ఉపయోగించి అతడు అనేక కార్యాలు నిర్వర్తించవచ్చు. నిర్వర్తిస్తున్నాడు కూడా. కొండ గుహల్లో చెట్టు తొర్రల్లో ఉంది అనాగరికుడిగా తలదాచుకున్న మానవుడు, అంచలంచెలుగా అభివృద్ధి చెంది నేడు అనేక అధునాతన సౌకర్యాలతో తులతూగడం మానవుని కృషి ఫలితమే, శాస్త్ర పరిజ్ఞానంతో జీవితాన్ని సుఖమయంగా దిద్ది తీర్చుకోవడం మానవుని నిర్విరామ కృషి ఫలితమేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

అలా కాకుండా నిద్రమత్తులో కునికేవానికి, ఎద్దువలె తిని మొద్దులాగా స్థబ్దంగా ఉండేవాడికి, ఎంత విలువైన సమయం వృధాగా వెళ్ళిపోతుందో తెలియదు.

కాలం ధనం కంటే విలువైనది. ఎవరికీ చెప్పకుండా ఎవరికీ అందకుండా, ఎవరి కోసం ఆగకుండా సాగిపోయే స్వభావం కలది, నిద్రబోతు, తిండిబోతు, తిరుగుబోతులు కాల ప్రభావాన్ని, కాలం యొక్క విలువను తెలుసుకోలేరు. తెలుగు సామెత ఎద్దులాగా తిని, మొద్దులాగా నిద్రించడం అనర్థదాయకమంటోంది. అసలు సామెతలు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

మానవుని బుద్ధి మాంద్యాన్ని, శారీరక మాంద్యాన్ని పోగొట్టి, చురుకుదనంతో నింపి, ఆహ్లాదాన్నందించడానికే ఆవిర్భవించాయి. కనుక నిద్రమత్తు వదలి, మేల్కొనాలి, ఎద్దువలె తిని మొద్దులాగా, నిర్జీవంగా పరుండడం మానివేయాలి. నిత్య నూతన చైతన్యంతో మానవుడు పురోగమించినపుడే సృష్టి పులకరిస్తుంది. నర జన్మ నవరసభరితమైన నవనవోన్మేష సౌందర్యంతో అలరారుతుంది అని ఈ సామెతల ద్వారా గ్రహించాలి.

9. తెలుగు సామెత: ఒళ్ళు వంగనివాడు దొంగలలో కలుస్తాడు.

బైబులు సామెత: సోమరి బానిసయగును (సామెతలు 12:24).

సోమరి లేమిని అనుభవించును (సామెతలు 10:4బీ 14:23బీ 19:15).

కొందరు అపరకుంభకర్ణులుంటారు. పనిచేయడం వారి ప్రవృత్తికే విరుద్ధం. దానికితోడు వారు కట్టే గాలిమేడలకు కొదువ ఉండదు. ఊహలు ఆకాశాన్నంటుతుంటాయి. అయ్య మాత్రం కాళ్లు బారచాచుకొని పడుకున్న చోట నుండి. లేవడు.

'మానసమున మంచి మల్లెపూల చవికె బావితోట జేసి బాలగూడి భోగినయ్యెదనన బోయెబో కాలంబు'

అంటూ వేమన ఇలాటివారి స్వభావం గుట్టు రట్టు గావించాడు. తోటలో బావి తవ్వి, మల్లె పందిరి వేసి యువతితో వినోదిస్తాననుకుంటూ ఊహలతో పొద్దుపుచ్చు తాడట సోమరివాడు, సోమరితనము గాఢనిద్రలో పడవేయును, సోమరివాడు పస్తు పడియుండునన్నది (సామెతలు 19:15) ఈ నీతినే వివరిస్తున్న వేరొక బైబులు సామెత. సోమరి బయట సింహముంది, నేను వెళ్ళనంటాడట (సామెతలు 22:13).

సోమరితనాన్ని తీవ్రంగా గర్హించిన సొలోమోను సోమరివాని ఇంటిని ఈ విధంగా వర్ణించాడు. 'సోమరివాని చేను నేను దాటిరాగా ఇదిగో, దానియందంతట ముండ్లతుప్పలు బలిసియుండెను. దూలగొండ్లు దానిని కప్పియుండెను. దాని రాతిగోడ పడియుండెను. నేను దానిని చూచి యోచన చేసికొంటిని, ఇంక కొంచెము నిద్ర, ఇంక కొంచెము కునుకుపాటు.... వీటి వలన దారిద్ర్యము పరుగెత్తి వచ్చును. ఆయుధధారి వచ్చినట్లు లేమి నీ మీదికి వచ్చును (సామెతలు 24:30-33).

సోమరితనానికి పర్యవసానాలను బైబులు

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

సామెతలు తేటతెల్లం చేస్తున్నాయి. పేదరికం, పస్తులు, అప్పులు, బానిసం అతనికి సంప్రాప్తిస్తాయి. తెలుగు సామెత మరింత చమత్కారంగా ఒళ్ళు వంచనివాడు దొంగల్లో కలుస్తాడనడం ఆలోచించదగిన విషయం. సోమరితనం వల్ల అవసరాలు తీరక పోషణకై వక్రమార్గాలు తొక్కాలన్న ప్రేరణ కలుగక మానదు.

కాయకష్టం చేసి గౌరవంగా సంపాదించుకొని కలో గంజో త్రాగి హాయిగా రొమ్ముపై చేయి వేసుకొని నిద్రించే శ్రమైక జీవనం ఉత్తమ మార్గం. ఎదుటనున్న అన్నం ముద్దను నోటికందించుకోవడం బద్ధకమైన సోమరి తక్కువ శ్రమతో ఎక్కువ ప్రతిఫలం కోసం మార్గాన్వేషణం చేస్తాడు. లంచాలు, దోపిడీ, చీట్లపేక చివరకు భిక్షాటన అతనికి మార్గాంతరాలౌతాయి. అలాటి వ్యక్తిని స్వంత భార్య సైతం సత్వరం విసర్జిస్తుంది. సోమరితనాన్ని వీడి చైతన్యమూర్తులై మనుషులు వర్ధిల్లాలని ఈ సామెతల సారాంశం.

10. తెలుగు సామెత: గోరంత నిర్లక్ష్యం కొండంత నష్టం

బైబులు సామెత: కొంచెము సేపు నిద్రింపుము, కొంచెము సేపు కునికిపాట్లు పడుము, ఈ లోపల దారిద్ర్యము దొంగవలె వచ్చి నీ మీద పడును (సామెతలు 24:34).

సృష్టి అంతటిలో నిర్భాగ్యుడు సోమరిపోతే, సోమరులను అసహ్యించుకొనని వాడుండడు. అలసత్వంతో కార్యాలు ఆలస్యం చేసేవారు కొండరైతే, చుద్దాం చేద్దామంటూ వాయిదాలు వేస్తూ ప్రొద్దుపుచ్చే ప్రబుద్ధులు కొందరు. కొద్దిపాటి నిర్లక్ష్యంతో కొండంత నష్టం తెచ్చిపెట్టుకొనే వారిని ఈ సామెతలు అభిశంసిస్తున్నాయి.

సృష్టిలో సోమరితనం కనిపించదు. చెట్లు చిగిరిస్తాయి. పూలు పూస్తాయి. అమని వస్తుంది. కోయిల కలస్వనంతో కూస్తుంది. చీమలు చురుకుగా పరుగెడుతుంటాయి. తోటలో నత్తలు తమ దారిన పాకుతుంటాయి. పక్షులు పెందలకడనే లేచి గుంపులుగా ఆహారాన్వేషణకై బయలువెడలుతుంటాయి. కొందరు మనుషులు మాత్రం ఉదయ భానుని కిరణాలు చురుక్కుమనిపిస్తున్నా అటువైపు ఒత్తిగిలి పడుకుందామని చూస్తుంటారు. తట్టి లేపుతున్న వారిని సైతం విసుక్కుంటూ సుషుప్తిలోకి తిరిగి జారుకొనే ప్రయత్నం చేస్తుంటారు.

అటువంటి అలసత్వానికి అలాటివారు తగిన

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

మూల్యం చెల్లించుకొనక తప్పదు. హితోపదేశంలో నారాయణ కవి వచించినట్లు, 'యత్న కృతములు ఫలియించుబీ నాశచేత మాత్ర మేకార్యమెండు సంపన్నమగును? ఉన్నవి శిథిలమౌతాయే తప్ప సోమరి తలపెట్టిన కార్యాలు అతడు కునికి నిద్రిస్తుండగా తమంతతాము ఈడేరవు. గదా. కొందరికి అరటి పండు సైతం వలిచి చేతిలో పెట్టాలి. ఇక నారికేళ పాకం మధురిమలు వారేమి గ్రహించగలరు? 'కష్టేఫలి' అని పెద్దలన్నమాట చద్దిమూట.

పాటుపడని వానికి చేటు తప్పదు. అన్నీ అలవోకగా జరిగిపోవాలని ఆశించే అలసునికి ఆయాసం తప్పదు. క్రీస్తు రాయబారి పౌలు తెస్సలోనిక పట్టణంలోని క్రైస్తవ సమాజానికి వ్రాస్తూ 'మీలో కొందరు ఏ పనియు చేయక పరులజోలికి పోవుచు అక్రమముగా నడుచుకొనుచున్నారని వినుచున్నాము. అట్టివారు నెమ్మదిగా పని చేయుచు, సొంతముగా సంపాదించుకొనిన ఆహారము భుజింపవలెనని మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట వానిని అజ్ఞాపూర్వకముగా హెచ్చరించుచున్నాను' అంటున్నాడు (తెస్సలోనిక 3:11,12).

సోమరివాడు తనకే గాక తానున్న సమాజానికి ప్రమాదహేతువు. అతడు పరాన్నభుక్కు చకిత మృగ శాబకంపైకి శార్దూలం లంఘించి వడిచిపట్టినట్లు దరిద్రం అతన్ని పట్టి కబళిస్తుంది.

తెలుగు బైబులు సామెతలు రెండూ ప్రధానంగా ప్రతిపాదిస్తున్న సత్యం చిరు నిర్లక్ష్యం బద్ధకం మూలంగా వాటిల్లే పెను ప్రమాదం సష్టం. పుస్తకాలు దులపడం ఆలస్యం చేస్తే చెదపురుగులు చేరి అమూల్య గ్రంథాలను స్వాహా చేస్తాయి. విద్యుత్ తంత్రులను సరిగా మలచడం అలక్ష్య పెడితే చిన్న నిప్పురవ్వ లేచి గోదాము నంతటినీ భస్మీపటలం చేస్తుంది. గోరంతలున్న పాఠాలను విద్యార్థి ఎప్పటికప్పుడు చదవకపోతే అవి కొండంతలై ఏకులు మేకులై కూర్చుంటాయి, కాబట్టి మానవులు కష్టజీవులై ఎప్పటి పనులను అప్పుడు చేసుకోవాలని ఈ సామెతల సందేశం.

11. తెలుగు సామెత: పొద్దున లేవని కాపుకు పొలం ఇచ్చేది గడ్డే

బైబులు సామెత: సోమరి రైతు పేదరికమున మ్రగ్గును (సామెతలు 28:19).

సోమరికి వేట చిక్కదు (సామెతలు 12:27).

బద్ధకమనేది ఫలప్రద జీవితానికీ ప్రగతికీ

బద్ధశత్రువు, అందునా కృషీవలునికి, కార్మికునికి, సోమరితనం వారి నైజానికే విరుద్ధం. ఇదే విషయాన్ని బైబులు, తెలుగు సామెతలు సూటిగా తెలియజేస్తున్నాయి.

'పొలాలనన్నీ హలాల దున్నీ ఇలాతలంలో హేమం పిండగ...'

అంటూ శ్రమించే రైతు ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేదని శ్రీశ్రీ నివాళులర్పించాడు. ఏ ముట్టడికి ఎంత ఖర్చయింది. ఏ మహారాణి విరహాగ్నిలో ఎంతవరకు తపించినదన్నది కాదు. తాజ్మహల్ నిర్మాణంలో రాళ్ళెత్తిన కూలీలెవరు? ఐర్లండు దేశపు ఓడ కళాసీ, చెక్ దేశపు గని పనివాడు, వీరి జీవన విధానమేమిటి? ఇవే ముఖ్యం. శ్రమ జీవులే నవసమాజ నిర్మాతలు, మానవ జాతి భావి నిర్ణేతలు, పై సామెతలలో ద్యోతకమయ్యే ఆత్మ ఇదే.

తెలుగు సామెత వ్యవసాయ రంగంలో ఒక సార్వత్రిక సంభవాన్ని కళ్ళ ముందుంచుతున్నది. పొలాలన్నీ లేత పైరుతో పిల్లగాలికి పరవశిస్తూ ఉండగా, సోమరివాని చేను మాత్రం గడ్డి దట్టంగా పెరిగి వెక్కిరిస్తూ ఉంటుంది. అనాయాసంగా అయాచితంగా పెరిగేది గడ్డే. 'ఏమిటి గడ్డం పెంచుతున్నావు?' అని అడిగితే 'నేను పెంచడం లేదు అదే పెరుగుతున్నాడ'ట వెనుకటికొకడు. సోమరులు కర్తవ్య విముఖులై జరగవలసిన దానిని వాయిదా వేస్తూ వస్తుంటే దారిద్ర్యం శీఘ్రంగా వారిపైకి దండెత్తి వస్తుంది. "సోమరులు వెట్టి పనులు చేయవలసివచ్చును" అనీ "సోమరి ఆశపడును గాని వాని ప్రాణమునకేమియు దొరుకదు" అనీ సామెతలున్నాయి (సామెతలు 12:24బీ 13:4).

వేట కూడ అంతే. 'పందిని కొట్టినవాడే పాటుబంటు' అన్నారు. మిగిలిన జంతుజాలం కన్నా పంది చురుకైనదనీ ఓ పట్టాన ఆయుధాలకు అందదనీ ప్రతీతి. వేటగాడు సోమరివాడైతే వట్టి చేతులతో తిరిగి రావలసిందే. ఒళ్ళువంచి చాకిరికి మళ్లని వాడి మళ్లు మట్టిగొట్టుకుపోతాయి. వ్యవసాయ రంగంలోనూ తదితర జీవనోపాధులలోనూ సోమరి అనుభవించే దురవస్థను ఈ సామెతలు కళ్ళకు కడుతున్నాయి.

12. తెలుగు సామెత: అడ్డెడు వడ్లు ఆశకుబోతే, తూమెడు వడ్లు దూడ తినిపోయింది.

బైబులు సామెత: దురాశతో సొమ్ము చేసుకొనువాని కుటుంబమునకు ఆపద

తప్పదు. (సామెతలు 17:23).

"కొండ నాలుకకు మందు వేస్తే, ఉన్న నాలుక ఊడిపోయిందనే ఇంకొక తెలుగు సామెతను ఇదే అర్థంలో ఉ పయోగిస్తారు. చిన్న వస్తువును ఆశించిపోతే దానికంటే పెద్ద వస్తువు మన దగ్గరున్నది పోతుంది. కొన్నిసార్లు ఇటువంటి సంఘటనలు మన జీవితాలలో తారసిల్లుతాయి, ఆశ ఉండడం సహజమే. అయితే దురాశ, లేక అత్యాశ మంచిది కాదు.

ఆశలను చంపుకుంటే, కోరికలను అదుపులో పెట్టుకుంటే దుఃఖం కలుగదనేది సర్వ జనామోదమైన సిద్ధాంతం. చిన్నదానిని ఆశించి మన దగ్గర ఉన్న పెద్దదానిని పోగొట్టుకొనే సందర్భాలలో పై తెలుగు సామెతను ఉపయోగిస్తారు.

బైబులు సామెత కూడా దురాశతో సొమ్ము చేసుకుంటే అతనికే కాకుండా, అతని కుటుంబానికి కూడా దుఃఖం కలుగుతుందని హెచ్చరిస్తుంది. సంతృప్తి కలిగి ఉన్నదానితో సుఖించేవాడికంటే అదృష్టవంతుడు మరొకడు లేడని చెప్పే బైబులు సామెతలు అనేకం దీనికి సమానార్థకాలుగా ఉన్నాయి.

'దురాశ దుఃఖమునకు చేటు' అనేది ఇంకొక తెలుగు సామెత. అద్దెడు వడ్లు వస్తాయని ఆశకుపోతే, తూమెడు వడ్లు ఉన్నవే పోతాయి. ఇది చాలా నిరుత్సాహాన్ని కలిగించే స్థితి, కాగా ఆశకు పోవడం, దురాశతో సొమ్ము చేసుకోవడం ఆరోగ్యకరమైన అలవాట్లు కావు, వీటివల్ల అశాంతి, అసంతృప్తి మాత్రమే కాకుండా అనారోగ్యం కలిగే ప్రమాదం కూడా ఉంది, కాబట్టి దురాశ, లోభం అన్ని అనర్థాలకు మూలం. అటువంటి సందర్భాలను ఈ తెలుగు, బైబులు సామెతలు రెండూ సమానార్థకాలుగా బోధిస్తున్నాయి.

13. తెలుగు సామెత: ఆశకు అంతం లేదు.

బైబులు సామెత: నరుని ఆశకు అంతం లేదు (సామెతలు 27:2; యోబు 20:20).

'ఆశ కన్న దుఃఖమతిశయింపగ లేదు' అన్నాడు వేమన. మనుషులు జీవితాంతం కోరికలతో భ్రమలతో సంచరిస్తూ అంతం లేని ఆశతో సమసిపోతూ ఉంటారు. అందుకే,

'అశను విడువని జీవికి
క్లేశము విడిపింపదరమె కేశవునకు నా
యాశా పాశము లెల్లను
రోసిన క్లేశంబు విడుచు రూఢిగ వేమా'

అని సిద్ధాంతీకరించాడు వేమన, ఆశలుడిగితే

పాశముక్తులౌతారు. ఆశాముక్తులు మునులౌతారు, కానీ ఇది అంత సులభం కాదు. తెలుగు, బైబులు సామెతలు వక్కాణించినట్లు మనిషి ఆశలు అనంతం. అత్యాశ ఉంటే ఇతర దుర్గుణా లెందుకు? అని అంటాడు భర్తృహరి. అనగా అదొక్కటే ఎక్కువ నిందలను తెచ్చిపెడుతుందని అర్థం. ఆశాబంధంలో చిక్కుకొని బయటపడలేక ఆశాభంగంతో దురపిల్లలడం మనుషులకు వాడుక, ఎన్ని నదులు కలిసినా అంబుధి నిండనట్లు ఎన్ని కోరికలీడేరినా ఆశలు ఊరుతూనే ఉంటాయి. అనివార్యమైన సముద్రపు పొంగును సైతం చెలియలికట్ట నిరోధించినట్లు ఆశను అంతమొందించిన వాడే పునీతుడు. సిద్ధార్థుడు సైతం దుఃఖానికి మూలం కోరిక లేక ఆశ అని గ్రహించాడు. పిడికెడంత హృదయంలో కడలిని మించిన ఆశలు దాచుకుంటాడు మానవుడు. ఈ మనో వైపరీత్యానికి పై చెప్పిన తెలుగు, బైబులు సామెతలు అద్దం పడుతున్నాయి.

14. తెలుగు సామెత: దురాశ దుఃఖమునకు చేటు

బైబులు సామెత: దురాశ వలన ఆపద కలుగును (సామెతలు 19:22).

ఆశ ఉండడం అవసరం. కాని దురాశ ఉండడం దుఃఖానికి మూలం. దురాశ అంటే అవసరానికి మించి వాంఛించడం. దీనివల్ల దుఃఖం కలుగుతుంది. ఈ దురాశ వల్ల చేయరాని పనులు చేసి అపాయాలలో చిక్కుకుంటాము. దుఃఖిస్తూ ఉంటాము. చిన్నయసూరి తన మిత్రలాభంలో వృద్ధ కపోతం ద్వారా, 'ఆహా, లోభమెంత చెడు గుణము. అన్ని దుః ఖాలకు లోభమే మూలం' అని చెప్పిస్తాడు. లోభం దురాశలోని అంతర్భాగమే! అలవిమాలిన ఆశలు పెట్టుకోవడం, అవి తీరక దుఃఖించడం మానవ సహజం. చేతికందినవాటితో, తనకు కలిగినవాటితో తృప్తి పడడం ఉత్తమ లక్షణం. కృష్ణశాస్త్రి 'ఆకాశంలో మెరిసే నక్షత్రాలు కావాలని ఆశించాను. చేతికందే పూలు దూరంలో లేవని వదిలేశాను. చుక్కలు మాయమైనవి. పూవులు వాడిపోయినవి. చివరకు నిరాశాపూరితమైన దుఃఖమే మిగిలిందంటాడు.

కాగా దురాశ దుఃఖాన్నే కలిగిస్తుంది. బాతు, బంగారు గుడ్ల కథ అందరికీ తెలిసిందే. ప్రతిరోజూ ఒక బంగారపు గుడ్డునిచ్చే బాతు కడుపులో చాలా గుడ్లు ఉంటాయని అన్నిటినీ ఒక్కసారే పొందవచ్చునని దాన్ని చంపి పొట్ట చీల్చి చూస్తే ఏమీ లేదు. దురాశకు దుఃఖం

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

తప్ప మరేమీ మిగలదు. ఉన్న డబ్బును లాటరీ టిక్కెట్లు కొనడానికి ఖర్చు చేసి, ఏమీ రాక నిరాశతో దుఃఖించే అభాగ్యులు అనేకులున్నారు. గుఱ్ఱపు పందెములలో లక్షలార్జించడానికి పోయి, ఉన్నదంతా పోగొట్టుకొని దుఃఖించేవారు కోకొల్లలు, చీట్లపేకలు, చిల్లర జూదాలు దురాశ వల్ల ఏర్పడినవే. అవి దుఃఖహేతువులే గాని మరొకటి. కాదు.

ఆశాజీవి శ్రమించాలి. తన శ్రమ ఫలితాన్ని మాత్రమే ఆశించాలి. తన కష్టం తనకు సత్ఫలితాన్నిస్తుందే తప్ప దురాశకు పోయి, అనూహ్యంగా అమిత లాభం తనకు కావాలని ఆశిస్తే, దుఃఖమే తప్ప సుఖం ఉండనే ఉండదు.

బైబులు సామెత దురాశల వల్ల ఆపదలు (దుఃఖాలు) కలుగుతాయని తెలియజేస్తుంది. 'లోభి' అంటే తనదేమీ పోకుండా, ఎదుటి వాళ్ళదంతా తనకే రావాలని కోరుకునేవాడు. ఇటువంటివాడినే దురాశాపరుడంటారు. ఈ లోభి, లేక దురాశాపరుడు తనకు, తన ఇంటివారికి కూడా దుఃఖాన్ని, బాధను కలిగిస్తాడని బైబులు సామెత ప్రబోధిస్తున్నది (సామెతలు 15:27), బైబులు గ్రంథంలో (2 రాజులు 5:1-27) నామాను అనే సైన్యాధిపతి తన కుష్ఠ రోగము నయము చేసిందుకు ఎలీషా ప్రవక్తకు కానుకల నీయబోగా, ప్రవక్త వాటిని తీసికొనుటకు నిరాకరిస్తాడు. అయితే గేహసీ దురాశాపీడితుడై తన యజమానుడైన ప్రవక్తకు తెలియకుండా కానుకలను నామాను నుండి స్వీకరించాడు. తత్ఫలితంగా ఎలీషా వానిని శపింపగా కుష్ఠరోగి అయ్యాడు. కనుక బైబులు సామెత, 'దురాశ వల్ల ఆపద కలుగునని, తెలుగు సామెత 'దురాశ దుఃఖమునకు చేటు' అని ఒకే భావాన్ని వ్యక్తీకరిస్తున్నవి.

15. తెలుగు సామెత: పొరుగింటి పుల్లకూర రుచి

బైబులు సామెత: దొంగిలించిన భోజనము మిక్కిలి రుచిగా నుండును (సామెతలు 9:17).

బైబులు సామెతలో ఉన్నంత స్పష్టంగా తెలుగు సామెతలో దొంగిలించడం గురించి లేదు. అయినా రెండిటిలోనూ తనది కానిది కంటికి ఆకర్షణీయంగా కనిపించడమే ముఖ్య ప్రతిపాదనం.

బైబులు ధర్మశాస్త్రానికి, నీతి న్యాయాలకూ పట్టుగొమ్మ వంటి ఆజ్ఞ: 'నీ పొరుగువాని ఇల్లు ఆశింపకూడదు.

నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను అతని దాసినైనను అతని యెద్దునైనను అతని గాడిదనైనను నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపకూడదు' (నిర్గమకాండము 20:17).

ఆశించడమే పాపమని పవిత్ర గ్రంథం ఘోషిస్తున్నది. క్రీస్తు దీనిని నొక్కి వక్కాణించాడు. మనసులో పరవస్తు, పరగృహ, పరదారల పట్ల ఆశ మిణుక్కుమనడం క్షంతవ్యమే గానీ, ఆ ఆలోచనను కార్యరూపానికి తెచ్చి తనవి కానివాటిని దొంగిలించి అనుభవించడం నిశ్చయంగా దుష్కృతే.

తన ఇంట లక్ష్మీదేవి వంటి ఇల్లాలిని ఉంచుకొని ఆమె కాలిగోటికి సరిపోలని పరస్త్రీల పొందు ఆశించేవాడు ఇలాటివాడే. ఇంట మృష్టాన్న భోజనముండగా పక్కింట్లో కొయ్యగోంగూర వంటకాన్ని లొట్టలు వేసుకుంటూ చూచే తిక్కశంకరయ్యలుంటారు.

లక్ష్మీనాథుడు శ్రీ మహా విష్ణువు సైతం దీనికి మినహాయింపు కాదంటున్నాడు వేమన:

'పాల సాగరమున బవ్వళించిన హరి
గొల్లయిండ్ల పాలు కోరనేల
ఎదుటివారి ద్రవ్యమెల్లవారికి దీపి

ఎదుటివారి ద్రవ్యమెల్ల వారికి దీపి అని చెప్పడంలో వేమన పైన పేర్కొన్న తెలుగు బైబులు సామెతలతో ఏకీభవిస్తున్నాడు. ఇలాటిదే వేమన విరచితమైన ఆటవెలది వేరొకటి.

'కనక పర్వతమున గాపురముండిన
అనిమిషేశ్వరునకు నాసపోదు:
కనక కుండలములు కర్ణుని నడగడా?'

బంగారు కొండయైన మేరువు తన నివాసమైనప్పటికీ దేవేంద్రుడు కర్ణుని స్వర్ణకుండలాలు ఆశించాడు. ఈతడే రంభా ఊర్వశి మేనకాది అప్సరసలు తన ఆజ్ఞానువర్తులైనప్పటికీ అహల్యా సతిని ఆశించి గౌతమ మహర్షి క్రోధానికి గురైనాడు కదా!

ఇలాటి దురాశను జయించి ఉన్నదానితో తనివితీరి తృప్తి చెందువాడు ఉత్తముడు.

16. తెలుగు సామెత: కడుపులో లేనిది కౌగలించుకుంటే వస్తుందా?

బైబులు సామెత: లోలోపల ప్రేమించుటకంటె బహిరంగముగా గద్దించుట మేలు. మేలును కోరి స్నేహితుడు గాయములు చేయును పగవాడు లెక్కలేని ముద్దులు పెట్టును. (సామెతలు : 27:5,6).

ప్రేమ, బాధ్యత కలిసి ఉండే స్నేహితుడు ఒక్కొక్కసారి గాయాలు చేస్తాడు. అంటే బాధపెడతాడు. అది మన మంచికీ, ఏదైనా పొరపాటు ఉంటే సరిదిద్దుకోవడానికీ దారితీస్తుంది. ఇది మిత్ర ధర్మం. అయితే పగవాడు నిరంతరం ప్రేమిస్తున్నట్టు నటించి, ముద్దులు పెట్టి, అంతరంగంలో విషం వెళ్లగక్కుతాడు. వీరిని పయోముఖ విషకుంభాలని తెలుగు సామెతలలో వర్ణిస్తే, గొర్రె తోలు కప్పుకున్న తోడేళ్ళు అని బైబిలు వర్ణిస్తున్నది.

దీనికి దృష్టాంతం బైబులులోనే కనిపిస్తుంది. "యేసు ఇంకా మాట్లాడుతూ ఉండగానే జనసమూహం, వారి ముందు పన్నెండుమంది శిష్యులలో ఒకడైన యూదా నడిచి రావడం కనిపించింది. యేసును ముద్దు పెట్టుకోవడానికి అతడు ఆయన దగ్గరకు వచ్చాడు. 'యూడా ముద్దుపెట్టుకొని మానవు పుత్రుణ్ణి పట్టి ఇస్తున్నావా?' అని యేసు అతనితో అన్నాడు. కపట స్నేహితుడు పైకి ప్రేమ ఉన్నట్టు నటించి నాశం చేస్తాడు. యేసు పట్ల యూదా చేసింది అదే! (లూకా 22:41,42), కాబట్టి కడుపులో ఉన్నదానిని బట్టే క్రియలను అంచనా వెయ్యాలి. కడుపులో (హృదయంలో) ఉంటేనే ఆ ప్రేమ సత్ఫలితాన్నిస్తుంది కాని కేవలం అర్హత లేని కౌగలింపులవల్ల సత్ఫలితాలు రావని ఈ సామెతల భావం.

17. తెలుగు సామెత: నోరు మంచిదైతే ఊరి మంచిదౌను

బైబులు సామెత: నాలుకను బట్టియే నరుని జీవితముండును (సామెతలు 18:21).

నాలుక శరీరవయవాలలో చిన్నది. అయితే దానికన్నా ప్రమాదకరమైన అంగం వేరొకటి లేదు. హత్యలు చేసేవారు. కత్తులు, ఇతర మారణాయుధాలు ఉపయోగిస్తారు. కానీ మనిషిని నిలువునా ప్రాణాలు తీయడానికి ఒక్క క్రుంగదీసే మాట చాలు. కర్ణాకర్ణిగా వినబడే నీలాపనిందలు, ఆరోపణలు ఎటునుండో ఎగిరి వచ్చి గుండెల్లో గుచ్చుకునే బాణాల వంటివి. ఆ మాట ఎవరన్నారో తెలియకుండానే ఊరంతా కార్చిచ్చు రేపుతుంది.

నాలుక మూలంగా కలిగే ఇక్కట్లు రాజ్యాలకు, నగరాలకు, గ్రామాలకు చేసే కీడు ఒక ఎత్తు అయితే నాలుకను అదుపు చేసుకోలేక మనిషి పడే పాట్లు, ఇతరులకు కలిగించే హానీ మరొక ఎత్తు. కొందరు అదే పనిగా ఇల్లిల్లూ తిరిగి లేనిపోని నీలివార్తలు చేరవేస్తుంటారు.

ఈ కళలో అరితేరినవారు శ్రోతల మనసుల్లో అనుమాన, విద్వేష బీజాలు చల్లి చక్కాగాపోతారు. చిచ్చు రేగుతారు.

బైబులు సామెత, తెలుగు సామెతా కూడా ముఖ్యంగా నాలుక మూలంగా హాని, అపఖ్యాతీ మూటగట్టుకోవడాన్నే ప్రతిపాదిస్తున్నాయి. ఈ వేళ గాకుంటే రేపయినా ఇలాటి తంటాలమారిని ప్రజానీకం పసిగట్టకపోరు. ఒకరి మీద ఒకరికి చాడీలు చెబితే దానికి అతి సరళమైన పరిష్కారం ఆ ఇద్దరు వ్యక్తులు ఎదురుపడి 'నీవిలా అన్నావా?' అని పరిష్కారంగా తెలుసుకోవడమే. మబ్బులు వీడిపోయి తమ ఇద్దరి మధ్య అపార్థాలు సృష్టించినవాడి అసలు రంగు తేటతెల్లమవుతుంది. కుటుంబాలలో, గ్రామాలలో సాధారణంగా ఇలా కొండేలు ప్రచారం చేసేవారెవరో అందరికీ తెలిసే ఉంటుంది. అలాటివారి విషయంలో కొంత జాగ్రత్తగా ఉండడం కూడా అభ్యాసం చేస్తారు. అలాటివారిని పూర్తిగా నమ్మరు. ఏ సంగతీ వారికి తెలియనీయకుండా జాగ్రత్తపడతారు.

దీనికి భిన్నంగా ముత్యాల వంటి మాటలు సమయోచితంగా మేలు కలిగించే సుద్దులు, ఆప్యాయత ఉట్టిపడే మధురోక్తులు పలికే వారిని ఊరంతా సన్మానిస్తారు. అన్ని సందర్భాలకు వారిని ఆహ్వానిస్తుంటారు. నోరు మంచిదైతే ఊరు కూడా మంచిగానే ఉంటుంది. బైబులు సామెత ప్రకారం ఒక మనిషి సంభాషణను బట్టే అతని జీవితం కూడా ఉంటుంది.

## ఉపయుక్త గ్రంథాలు

గీతికా శ్రీనివాస్, టి. తెలుగు సామెతలు (సంకలనం). జె.పి. పబ్లికేషన్స్, విజయవాడ, 2002

గోపాలకృష్ణ, రెంటాల. తెలుగు సామెతలు (సంకలనం), నవరత్న బుక్ సెంటర్, విజయవాడ, 2002

గోపి, సుధ తెలుగు సామెతలు (సంకలనం). పల్లవి పబ్లికేషన్స్, విజయవాడ, 2000

చిన్నయసూరి, పరవస్తు. సంపూర్ణ నీతిచంద్రిక. వీరేశలింగం, కందుకూరి. రోహిణి పబ్లికేషన్స్, రాజమండ్రి, 2003

జయప్రకాశ్, ఎన్. తులనాత్మక సాహిత్యం, శ్రీ దివ్య పబ్లికేషన్స్, మదురై, 1998

జాను,ఎం పి. క్షమాపణ, ఎస్ & ఎస్ పబ్లికేషన్స్, సమిశ్రగూడెం, 2008.

జాషువ, గుఱ్ఱం. ఫిరదౌసి, జాషువ ఫౌండేషన్, విజయవాడ, 1996

జాషువ, గుఱ్ఱం. ఖండకావ్య సంపుటి, జాషువ ఫౌండేషన్, విజయవాడ, 1997

జోజయ్య, పూదోట. పవిత్ర గ్రంథము అనువాదము

జోజయ్య, పూదోట బైబులు భాష్య సంపుటావళి, సెయింట్ పీటర్స్ కరీడ్రల్ విజయవాడ, 2003

తులజ, పుట్టపర్తి. తెలుగు సామెతలు - సాంఘిక జీవితం! ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1985

నాగరాజు, బండి. సామెతలు - ఛందస్సామ్యతలు, భారతి, మార్చి, 1966

పోతన, బమ్మెర. శ్రీమహాభాగవతము, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1987

బద్దెన. సుమతీ శతకము, గొల్లపూడి వీరాస్వామి సన్, రాజమండ్రి, 2000

బాలి, గాలి, క్యాతలిక్ అనువాదము. విలియం, పాటిబండ్ల ఇగ్నేషియస్, ఏరువ. ఆంధ్ర క్యాతలిక్ బైబులు సంఘము. గుంటూరు, 1998

మోహన్, జి.యస్. సామెతలలో సాంఘిక జీవితం, శ్రీనివాస పబ్లికేషన్స్, మలయనూరు, 1983

రమాపతి రావు, అక్కిరాజు. తెలుగు సామెతలు - సాంఘిక జీవితం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 1992

రమాపతిరావు, అక్కిరాజు. సామెతలు - పుట్టుపూర్వోత్తరాలు, అభినందన, తూమాటి దొణప్ప. షష్టిపూర్తి సంచిక, డిసెంబరు, 1987

రాజేశ్వరరావు, పి. తెలుగు సామెతలు (సంకలనం), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2000

రాధాకృష్ణ బూదరాజు (సం). మరవరాని మాటలు, మీడియా హౌస్ పబ్లికేషన్స్, హైదరాబాదు, 2004

రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపద గేయ సాహిత్యము. జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు, 1978

రామాంజులు, ఎం.జె. బైబులు వ్యాఖ్యానము, పాత నిబంధన- రెండవ భాగము

రామాచార్యులు, బి. తెలుగు సామెతలు - మానవ స్వభావం. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1988

లక్ష్మణకవి, ఏనుగు. భర్తృహరి సుభాషిత రత్నావళి, జె.పి. పబ్లికేషన్స్, విజయవాడ, 2006

లక్ష్మీ నరసింహం, ఇంగువ. సహస్ర సామెతలు (సంకలనం), పంచాక్షరీ పబ్లికేషన్స్, గుంటూరు, 1964

లక్ష్మీ నారాయణ, ఎస్. చక్కని తెలుగు సామెతలు (సంకలనం). డి. బోస్ & బ్రదర్స్, హైదరాబాదు, 1987

లక్ష్మీ నారాయణ, గంగిశెట్టి (సం) తులనాత్మక సాహిత్య వ్యాసాలు, పొట్టి శ్రీరాములు. తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 2004

వెంకటప్పయ్య, వెలగా (సం). రాయలసీమ పలుకుబడులు, తెలుగు సాహితి, 1979

వెంకటరావు, నిడదవోలు. తెలుగు సామెతలు, భారతి, జనవరి, 1966.

వెంకయ్య, మారన. భాస్కర శతకము, గొల్లపూడి వీరాస్వామి సన్, రాజమండ్రి, 2005

వేంకట నరసయ్య, వెల్లంకి. రైతు సామెతల సమీక్ష తెలుగు విశ్వవిద్యాలయం, హైదరబాదు, 1989

వేంకట రమణయ్య, బులుసు. వేమన పద్య రత్నాకరము, బాల సరస్వతీ బుక్ డిపో, మద్రాసు, కర్నూలు, 2003

వేంకట శాస్త్రి, ముసునూరి. విద్యార్థి కల్పతరువు, వెంకట్రామ అండ్ కో, ఏలూరు, 1984

వేంకటరావు, నిడదవోలు. సాటి సామెతలు (సంకలనం). మరియప్ప భట్, ఎమ్. విజయా పబ్లికేషన్స్, మద్రాసు, 1960

వేంకటావధాని, దివాకర్ల. తెలుగు సామెతలు (మూడవ కూర్పు యశోదారెడ్డి కోదండరామ రెడ్డి, మరుపూరు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1986

శ్రీనివాసరావు, వేమూరి. పూర్వ గాథా లహరి, వెంకట్రామ అండ్ కో, విజయవాడ, 1976

సరళాదేవి, పి. తెలుగు సామెతలు - సాంఘిక చరిత్ర, శర్వాణి ప్రచురణలు, విజయనగరం, 1987

సర్వేశ్వర శాస్త్రి, దర్భా శ్రీ సూర్యారాయాంధ్ర నిఘంటువు (ఆరవ సంపుటం). తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1988

సీతారామాచార్యులు, బి. శబ్ద రత్నాకరము. ద మద్రాస్ స్కూల్ బుక్ అండ్ లిటలేచర్ సొసైటీ, మద్రాసు 1958

సుందరం, ఆర్వీయస్, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983.

--- Torch Bible Commentary, Torch S.C.M. Press, London, 1981.

International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.8, Issue-12, December 2021
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

---- సామెత, గోకుల్ పబ్లికేషన్స్, హైదరాబాదు, 2001

Beaucamp, E. Man's Destiny in the Books of Wisdom Alba. House, New York, 1970

Brown, R.E., (ed). New Jerome Biblical Commentary

David Noel Freedmann (ed). Anchor Bible Dictionary, Doubleday, New York, 1992

David Noel Freedmann (ed). Encyclopaedia Judaica Keter Publish ing House, Jerusalem, 1978

David Noel Freedmann (ed). Interpreter's Bible Abingdon Press, Nashville, New York, 1995

David Noel Freedmann (ed). Interpreter's Dictionary of the Bible Abingdon Press, Nashville, New York, 1962

Rankin, O.S. Israel's Wisdom Literature Schoken Books, New York, 1969

Reginald, C.F. (ed). New Catholic Commentary on the and others Holy Scripture Nelson, London, 1969

Scott, R.B.Y. The Way of Wisdom in the Old Testament. Macmillan Co., New York, 1971

Subramanian, P.R. An Introduction to the Study of Indian Folklore, Tuticorin, 1972

von Rad, G. Wisdom in Israel, S.C.M. Press, London, 1972

Whybray, R.N. The Book of Proverbs. (Cambridge Bible Commentary) Cambridge University Press, 1972.